


ఒకప్పుడు గోదావరీ మండలంలో ఒక మహాభక్తురాలుండేది. ఆమె పేరు లక్ష్మీదేవి. పేరుకు తగినట్లుగా ఆమెకు చాలా భూములుండేవి. ఇంటి నిండా నౌకర్లూ చాకర్లూ ఉండేవారు. వచ్చేపోయే వారితో వారిల్లు ఎప్పుడు చూసినా పెళ్ళివారిల్లులా ఉండేది.

అన్నీ బాగానే ఉన్నాయిగానీ, భగవంతుడామెకు ఓ లోటు చేశాడు. ఆమెకు సంతానం లేదు. బిడ్డల కోసం ఆమె చేయని పుణ్యకార్యం లేదు. ఆమె దర్శించని క్షేత్రంగాని, తీర్థంగాని లేవు. అయినా ఆమె కోరిక తీరలేదు

ఒకసారి ఆ ప్రాంతాన పెద్ద కరువు వచ్చింది. ఎక్కడెక్కడి జనమూ లక్ష్మీదేవిగారింటికి వచ్చి పడింది. ఆమె లేదనకుండా ఉన్నంతలో అన్నదానం చేస్తూనే ఉన్నది.

అన్ని ప్రాంతాల నుండి ప్రజల ఆక్రందనాలు వినిపిస్తున్నాయి గానీ, గోదావరీ మండలం నుండి వినిపించడం లేదు. కారణమేమిటో కనుక్కోమన్నాడు పరమశివుడు. నంది విషయమంతా కనుక్కొని తండ్రికి నివేదించాడు. ఆమెకున్న లోటును కూడా శివునకు జ్ఞాపకం చేశాడు.

"పోనీ అంత పుణ్యాత్మురాలు గదా ! ఆమెగారికి సంతానాన్ని ప్రసాదించరాదా "? అన్నది పార్వతీదేవి.

శంకరుడు 'సరే' అన్నాడు.

ఇది జరిగిన సంవత్సరానికల్లా లక్ష్మీదేవి ఒక బిడ్డను కన్నది. ఆ బిడ్డను కన్నప్పటి నుండీ ఆమెకు క్షణం కూడా తీరుబాటు లేకుండా పోయింది. వాడి అచ్చట ముచ్చటలతోనే కాలక్షేపం చేయసాగింది. అతిధులు అభ్యాగతులు పూర్వంలాగే వస్తున్నారు. కానీ, వారిని పరామర్శించేవారే లేకపోయారు. పిడికెడు మెతుకుల కోసం అరచీ, అరచీ గొంతుక పొడారిపోయి, సణుగుతూ అభ్యాగతులు వెళ్ళిపోసాగారు.

ఇలా రెండు మూడేళ్ళు గడిచాయి. కుర్రాడు గుమ్మడిపండులా

పెరుగుతున్నాడు. లక్ష్మీదేవి అతన్ని నేలమీదికి దించను గూడా దించడంలేదు. కందిపోతాడని ఆమె భయం !.

ఒకసారి పార్వతీ పరమేశ్వరులు లోకసంచారం చేస్తూ ఉండగా గోదావరీ మండల ప్రాంతములో వేలాది అన్నాతురులు కనిపించారు. శివుడు ఆశ్చర్యపోయాడు. అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన లక్ష్మీదేవి క్షేమంగా ఉన్నప్పుడు ఈ ఆకలి ఆక్రందన లేమిటి !.

శంకరుడు, తన దివ్యదృష్టితో సంగతిని గ్రహించాడు. కొడుకు కారణంగానే ఆమె అన్నదానం మానివేసిందని ఆయన గ్రహించాడు. ఆయన మనస్సులో ఏదో భావం పొటమరించిది,

ఆ మరునాడే లక్ష్మీదేవిగారి పండంటి కొడుకూ కన్నుమూశారు.

ఓ వారం రోజులపాటు ఆమె కూడూ నీరు ముట్టలేదు.

ఆ తర్వాత యధాపూర్వంగా అన్నదానం సాగిపోయింది.

—o—